క్లుప్తంగా

క్రీడాకారులకు అభినందన


క్రీడాకారులను అభినందిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ శామ్యూల్ పాల్

కర్నూలు (టౌన్) : ఇటీవల రాజమండ్రిలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి షూటింగ్ పోటీల్లో కర్నూలు క్రీడాకారులు ప్రతిభ చాటారు. అండర్-17 బాలికల విభాగంలో సాయి ఐశ్వర్య (బంగారు), రిషికేష్ రెడ్డి (బంగారు), రామ విగ్నేష్ (కాంస్యం) పతకాలు సాధించారు. పతకాలు సాధించిన రైఫిల్ షూటర్లను మంగళవారం సాయంత్రం డీఈఓ కార్యాలయంలో ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శామ్యూల్ పాల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, ప్రధాన కార్యదర్శి పరమేష్ పాల్గొన్నారు.

ఆదివాసీల పోరాట యోధుడు కొమరం భీమ్


కొమరం భీమ్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మహిళా నేతలు

కర్నూలు(అర్బన్): ఆదివాసీల పోరాట యోధుడు కొమరం భీమ్ అని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి అన్నారు. స్థానిక బీ క్యాంప్‌లోని వేదిక ప్రధాన కార్యాలయంలో మంగళవారం కొమరం భీమ్ 123వ జయంతి కార్యక్రమాన్ని రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాలో జన్మించిన కొమరం భీమ్ ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం కోసం నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించారన్నారు. గిరిజనుల కోసం అనేక సంవత్సరాలు అలుపెరుగని ఉద్యమాలు నిర్మించారని గుర్తు చేశారు.

25న నగరపాలక సర్వ సభ్య సమావేశం

కర్నూలు (టౌన్): ఈనెల 25 వ తేదీన నగరపాలక సంస్థ పాలకవర్గ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఎస్. రవీంద్రా బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎస్‌బీఐ కాలనీలోని నూతన కౌన్సిల్ హాలులో మేయర్ బీవై రామయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, వాణిజ్య శాఖల మంత్రి టీజీ భరత్, కర్నూలు, నంద్యాల పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరీ, శాసన సభ్యులు గౌరు చరితా రెడ్డి, బొగ్గుల దస్తగిరి, డిప్యూటీ మేయర్లు, స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు సమావేశానికి హాజరవుతారని తెలిపారు.

లా పరీక్షల ఫలితాలు విడుదల చేయాలి

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరిగిన లా 5వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విడుదల చేయాలని టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చంద్రప్ప, న్యాయ కళాశాల విద్యార్థులు గోవర్ధన్, సుమలత, అరుణ, దీప్తి కోరారు. మంగళవారం వర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ఎన్ టీకే నాయక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆల్ ఇండియా బార్ పరీక్షలకు హాజరు అయ్యేందుకు ఈనెల 25వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వీసీ దృష్టికి తీసుకెళ్లారు. 5వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదల చేస్తేనే రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఉంటుందని తెలిపారు.

పెండింగ్ పనులు చేయాలి

కర్నూలు(సెంట్రల్): నగర పరిధిలోని 27వ వార్డు శ్రీరామనగర్‌లో పెండింగ్‌లో ఉన్న రహదారి పనులను వెంటనే పూర్తి చేయాలని సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యుడు సాయి బాబా డిమాండ్ చేశారు. మంగళవారం ఆ పార్టీ బృందం వార్డులో పర్యటించి జరుగుతున్న పనులను పరిశీలించింది. నెల రోజుల క్రితం రోడ్లు, కాలువల నిర్మాణం కోసం గుంతలు తవ్వి వదిలి వేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. వెంటనే పనులు పూర్తి చేయాలన్నారు.

సీసీ రోడ్లు నిర్మించాలి

కర్నూలు (టౌన్) : అమీర్ హైదర్‌ఖాన్ నగర్‌లో సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని సీపీఎం నగర కార్యదర్శి రాజశేఖర్ నగరపాలక కమిషనర్ రవీంద్రాబాబును కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. కాలనీలో డ్రైనేజీ నిర్మించినప్పటికి కాల్వలు శుభ్రం చేయడం లేదన్నారు. అలాగే మహిళలకు సామూహిక మరుగుదొడ్లు లేవన్నారు.

నేడు పవమాన హోమం

కర్నూలు కల్చరల్: నగరంలోని వన్‌టౌన్‌లో ఉన్న పేట శ్రీరామాలయ శతాబ్ది బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని బుధవారం పవమాన హోమం నిర్వహిస్తున్నట్లు రామాలయ శతాబ్ది బ్రహ్మోత్సవ సమితి సభ్యులు తెలిపారు. ఉదయం 9 గంటలకు ఆలయం హోమ మండపంలో హోమ క్రతువు జరుగుతుందని పేర్కొన్నారు. భక్తులందరూ పాల్గొన వచ్చని విజ్ఞప్తి చేశారు.

మహిళలపై వేధింపులకు పాల్పడితే ఉపేక్షించం

- ప్రతి కార్యాలయంలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేయాలి
- జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేసీ నవ్య, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి తదితరులు

కర్నూలు(సెంట్రల్): పనిచేసే ప్రదేశంలో మహిళలపై ఎవరైనా వేధింపులకు పాల్పడితే ఉపేక్షించే ప్రసక్తే లేదని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో మహిళలు పనిచేసే చోటా వారిపై జరిగే లైంగిక వేధింపులు, హింస, వివక్ష కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై జిల్లాస్థాయి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జేసీ డాక్టర్ బి.నవ్య, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి, స్త్రీ శిశు సంక్షేమ శాఖపీడీ వెంకటలక్ష్మి, లైంగిక వేధింపుల కమిటీ చైర్మన్ డాక్టర్ మాధవి శ్యామల, న్యాయవాది నాగలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. పని ప్రదేశాల్లో మహిళలపై జరిగే వేధింపుల నివారణకు కమిటీలు ఏర్పాటయ్యాయని, 2013లో వచ్చిన చట్టంతో అవి మరింత బలోపేతమైనట్లు చెప్పారు. ఈ చట్టాల ప్రకారం ప్రతి ప్రభుత్వ/ప్రైవేట్‌కార్యాలయాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ ఫిర్యాదుల కోసం అంతర్గత కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ఆ కమిటీలకు వచ్చిన ఫిర్యాదులతో మొదట సదరు వ్యక్తిని హెచ్చరించాలని, పద్ధతి మార్చుకునేలా సూచించాలన్నారు. ఒకవేళ సదరు వ్యక్తి మీరి ప్రవర్తిస్తే చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి వేధింపులపై ఫిర్యాదు చేయాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో కూడా విద్యార్థులకు పోక్సో యాక్ట్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మాట్లాడతూ..ఆర్టికల్స్ 14,15,19,21 ఆధారంగా పోక్సో యాక్ట్‌ను తయారు చేశారని, దీని ప్రకారం మహిళలపై లైంగికవేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వివరించారు. మహిళలు టోల్ ఫ్రీ నంబర్ 1500కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే న్యాయసేవాధికారసంస్థ సహాయ,సహకారాలు అందిస్తుందన్నారు.అంతకు ముందు డాక్టర్ మాధవిశ్యామల, ప్రేమ, నాగలక్ష్మి, పోక్సో యాక్ట్ అమలు, చట్టాలపై మహిళా ఉద్యోగులకు అవగాహన కల్పించారు.అనంతరం పని చేసే ప్రదేశాల్లో మహిళలపై జరిగే లైంగిక వేధింపులు, హింస నిర్మూలనకు సంబంధించిన పోస్టర్లను జేసీ, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శులు ఆవిష్కరించారు.

క్రీడల్లో రాణించాలి


ఖో-ఖో పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

కర్నూలు (టౌన్): బాల బాలికలు క్రీడల్లో రాణించాలని స్పోర్ట్స్ ప్రమోటర్ శ్రీధర్ రెడ్డి, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అన్నారు. మంగళవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17 విభాగాల్లో బాల బాలికలకు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఖో-ఖో, సైక్లింగ్, ఉషూ, సాఫ్ట్‌బాల్, పవర్ లిఫ్టింగ్ క్రీడాంశాల్లో పోటీలను అతిథులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు శారీరక ధృడత్వానికే కాకుండా మానసిక ప్రశాంతతకు దోహద పడతాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, సహాయకార్యదర్శి పరమేష్ పాల్గొన్నారు.

ఏపీఆర్ఆర్‌పీ పనులపై ఆరా

- వైఎస్సార్‌సీపీ పాలనలో రూ.189.11 కోట్లతో చేపట్టిన పనులు
- ఆరు ప్యాకేజీల్లో 42 పనులు పూర్తి కాగా, పురోగతిలో 23

కర్నూలు(అర్బన్): జిల్లాలో ఆంధ్రప్రదేశ్ రూరల్ రోడ్స్ ప్రాజెక్టు (ఏపీఆర్ఆర్‌పీ) కింద చేపట్టిన పనులపై ప్రభుత్వం ఆరా తీస్తోంది. 2019లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ఈ పనులకు టెండర్లు పిలిచారు. అంతలోనే ఎన్నికలు రావడంతో ఈ పనులు ఆగిపోయాయి. అప్పట్లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలకు రోడ్డు సౌకర్యాలు కల్పించాలనే సదుద్దేశంతో టీడీపీ పాలనలో టెండర్ల దశలో ఆగిపోయిన ఈ పనులపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నేపథ్యంలోనే జిల్లాలో 41, 42, 43, 44ఏ,44బీ, 44సీ ప్యాకేజీల కింద రూ.189.11 కోట్లతో 85 పనులను (86.10 కిలోమీటర్ల రోడ్లు, బ్రిడ్జీలు) చేపట్టారు. ఇందులో ఇప్పటి వరకు 42 పనులు పూర్తి కాగా, 23 పనులు పురోగతిలో ఉండగా, వివిధ కారణాల వల్ల 23 పనులు ప్రారంభం కాకపోగా, ఒక పనిని డ్రాప్ చేశారు. చేపట్టిన ఈ పనులకు సంబంధించి మొత్తం రూ.82 కోట్లు వెచ్చించగా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.49 కోట్లను చెల్లించింది.

ఈ పనులపై నేడు సమీక్ష .

జిల్లాలో ఐదేళ్ల కాలంలో ఏపీఆర్ఆర్‌పీ కింద చేపట్టిన పనులపై ఈ నెల 23వ తేదీన విజయవాడలో పీడీ ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించనున్నారు. ఈ సమీక్షకు జిల్లా నుంచి పీఆర్ ఎస్ఈ, ఈఈ, డీఈఈలు హాజరు కానున్నారు. సమీక్షలో ప్రధానంగా ఈ పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులను సీఎఫ్ఎంఎస్, నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేసేందుకు జరుగుతున్న జాప్యం, అప్రూ అయిన పనులపై సమీక్ష నిర్వహించనున్నారు. అలాగే గడిచిన ఆరు నెలలుగా ఎలాంటి పురోగతి చూపించని పనులు,


వైఎస్సార్‌సీపీ పాలనలో రూ.8.70 కోట్లతో పూర్తి చేసిన ఏ గోకులపాడు బ్రిడ్జి

నెలవారీ ప్రగతి నివేదికల గురించి సమావేశంలో చర్చించనున్నారు. ఈ ఏడాది డిసెంబర్ 31వ తేది నాటికి ఎన్ని పనులు పూర్తి చేస్తారు? ల్యాప్స్ అయిన ఈఓఏటీలపై వివరాలను సంబంధిత ఇంజి నుంచి కోరనున్నారు. ఇరిగేషన్, ఫారెస్ట్ డిపార్టుమెంట్ల నుంచి క్లియరెన్స్ రావాల్సిన విషయాలపైనా సమీక్ష నిర్వహించనున్నారు.

పీఎంశ్రీ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి

- పీఎంశ్రీ పాఠశాలలో నిర్దేశించిన మౌలిక వసతులు కల్పించాలి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): పీఎంశ్రీ పాఠశాలల్లో నిర్దేశించిన 21 రకాల మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియాపై ఎంఈఓలు, పీఎంశ్రీ స్కూళ్ల హెచ్‌ఎంలతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పీఎంశ్రీ కింద రెండు దశల్లో 52 పాఠశాలలను గుర్తించినట్లు చెప్పారు. మొదటి దశలో రూ.1.24 కోట్లతో 8 కెమిస్ట్రీ ల్యాబ్‌లు, 29 పాఠశాలల్లో రూ.1.45 కోట్లతో ఆట స్థలాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆయా పనులను త్వరగా పూర్తి చేయించి, బిల్లులను అప్‌లోడ్ చేయాలని ఏపీ డబ్ల్యూ ఐడీసీ ఇంజినీర్లను ఆదేశించారు. పీఎంశ్రీ కింద రెండో దశ కింద కూడా పనులు చేపట్టేందుకు నిధులు మంజూరైనట్లు చెప్పారు. కౌతాళం, పెద్దకడబూరు, వెల్దుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఆర్‌ఓ ప్లాంట్లు పనిచేయడం లేదని సంబంధిత హెచ్‌ఎంలు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, 52 పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లను పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు.

డిసెంబర్‌లోపు సిలబస్ పూర్తి కావాలి

పదో తరగతి సిలబస్‌ను డిసెంబర్‌లోపు పూర్తి చేసి, పబ్లిక్ పరీక్షల్లో ప్రతి విద్యార్థి పాస్ అయ్యేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా సూచించారు. జనవరి నుంచి విద్యార్థులకు ప్రశ్నలు, జవాబులు నేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పదో తరగతి విద్యార్థుల కోసం త్వరలోనే సెంట్రల్ బేస్డ్ వర్చువల్ తరగతుల బోధనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. బోధనపై ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులు ముందుకురావాలని కోరారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, ఆర్‌డీఓలు సందీప్‌కుమార్, భరత్‌నాయక్, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి పాల్గొన్నారు.

హాస్టళ్ల సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి రావు

కర్నూలు (అర్బన్): ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లోని సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి రావు అన్నారు. మంగళవారం ఆయన జిల్లా బీసీ సంక్షేమం, సాధికారత అధికారిణి టి.వెంకటలక్ష్మమ్మతో కలసి నగరంలోని సాంఘిక సంక్షేమం, బీసీ, ట్రైబల్ వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్టళ్లలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, ఆహార నాణ్యత, పరిశుభ్రతను పరిశీలించారు. ఈ నేపథ్యంలోనే విద్యార్థుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల్లోని రిజిస్టర్లను కూడా పరిశీలించారు.

సర్వే ఏడీ కార్యాలయ సూపరింటెండెంట్‌గా జ్యోతి

కర్నూలు (సెంట్రల్): జిల్లా సర్వే ఏడీ కార్యాలయ సూపరింటెండెంట్‌గా వి.జ్యోతి నియమితులయ్యారు. ఈమె ప్రస్తుతం చిత్తూరులో ఏడీ కార్యాలయ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. అక్కడి నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న అబ్దుల్ కలాం చిత్తూరుకు బదిలీ అయ్యారు.

టైలరింగ్‌లో మహిళలకు ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని గ్రామీణ ప్రాంత మహిళలకు కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ కె.పుష్పకుమార్ తెలిపారు. ఈ కోర్సుకు సంబంధించి వచ్చే నెల 2 నుంచి 30 రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు ఆయన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు ఉండి చదవడం, రాయడం వచ్చి ఉండాలని సూచించారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కూడా కల్పించబడుతుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు ఆరు ఫొటోలు, రేషన్‌కార్డు, ఆధార్, బ్యాంకు ఖాతా, విద్యార్హత ధ్రువపత్రాల నకళ్లతో సంస్థ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు కల్లూరు తహసీల్దారు కార్యాలయం పక్కన కెనరా బ్యాంకు హౌసింగ్ బోర్డు బ్రాంచీ పైన (మూడో అంతస్తు) సంప్రదించాలని సూచించారు. వివరాలకు 90007 10508 నంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

ఎక్సైజ్ కానిస్టేబుల్ మధుసూదన్‌రెడ్డి నుంచి రక్షణ కల్పించండి

- కలెక్టరేట్ ఎదుట నెరవాడకు చెందిన మహిళ ఆందోళన

కర్నూలు(సెంట్రల్): ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మధుసూదన్‌రెడ్డి, ఆయన కుటుంబీకుల నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ కల్లూరు మండలం నెరవాడకు చెందిన బి.వరలక్ష్మి మంగళవారం ఆందోళనకు దిగింది. కుటుంబ సభ్యులతో కలసి కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట చేపట్టిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తమకు కల్లూరు మండలం గోకులపాడు మజరా నెరవాడకు సంబంధించి సర్వే 262/4లో 88 సెంట్లు, 262/4ఏలో 44 సెంట్లు, 253/4లో 19 సెంట్ల భూమి తరాలుగా అనువంశికంగా వస్తోందన్నారు. ఇటీవల తన భర్త మరణించిన వెంటనే అదే గ్రామానికి చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్ మధుసూదన్‌రెడ్డి, ఆయనకుటుంబీకులు తమకు తెలియకుండానే ఆన్‌లైన్‌లో పేర్లను నమోదు చేయించుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తమ భూమిని తమకు ఇప్పించాలని ప్రజా సమస్యల పరిష్కార వేదిక, పోలీసు స్పందనలో ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడంలేదన్నారు. నాగులాపురం పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయడం లేదన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు

కర్నూలు (టౌన్): నగరంలోని పలు సచివాలయాల్లో ఆధార్ క్యాంపులను ప్రారంభించినట్లు నగరపాలక కమిషనర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి ఈనెల 25 వ తేదీ వరకు ఈ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగరంలోని 24 సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఈ అధార్ క్యాంపుల్లో బయోమెట్రిక్ అప్‌డేట్, చిరునామా, మొబైల్ నెంబర్, వంటి మార్పు, చేర్పులు చేసుకొవచ్చని తెలిపారు. పదేళ్ల దాటిన పిల్లలు తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోవాలని తెలిపారు.

ఎక్కడెక్కడంటే...

నగరపాలక సంస్థ పరిధిలోని కుమ్మరి వీధి- 11 సచివాలయం, ఓల్డ్ ఈద్గా గేరి-13, కాళికమ్మ వీధి-18, పెద్ద పడఖాన - 21, ఉస్మానియా కళాశాల-25, ఖడక్‌పురా-27, నరసింహారెడ్డి నగర్-119, హబీబ్ ముబారక్ నగర్-34, బుధవారపేట-39, ఇందిరమ్మ గృహాలు-45, మాధవి నగర్-52, గడ్డ వీధి- 16, అబ్బాస్ నగర్-69, షరీన్‌నగర్-75, రాఘవేంద్రనగర్-79, నిర్మల్‌నగర్-88, అయ్యప్ప నగర్-89, రాజీవ్ గృహకల్ప-93, ఎన్టీఆర్ కాలనీ-95, మామిదాల పాడు-98, విష్ణుటౌన్ షిప్-106, అశోక్ నగర్-120, ధర్మపేట-122, గాలిగేరి-129 లలో అధార్ క్యాంపులు ఉంటాయని తెలిపారు.

బిలీవర్స్ కంపెనీపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

కర్నూలు (టౌన్): ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తూ మోసం చేస్తున్న బిలీవర్స్ కంపెనీపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కర్ణాటకకు చెందిన భీమ్‌రాజ్, సురేష్, మేఘా రెడ్డి అనే వ్యక్తులు కృష్ణానగర్‌లోని ఎస్ఎస్ హోండా షోరూమ్‌పైన బిలీవర్స్ సంస్థను ప్రారంభించారన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని వారు నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. డీఎస్పీ సమగ్ర విచారణ జరిపించి మోసపోయిన అభ్యర్థులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

బస్సు డ్రైవర్‌పై రాళ్ల దాడి...

కర్నూలు (టౌన్): వేగంగా వెళ్లొద్దని హెచ్చరించిన ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై ఇద్దరు యువకులు రాళ్లతో దాడి చేశారు. మంగళవారం సాయంత్రం కర్నూలు నుంచి నంద్యాలకు వెళ్తున్న ఆర్టీసీ బస్సును పెద్దాసుపత్రి వద్ద ఇరువురు యువకులు ద్విచక్ర వాహనంలో వేగంగా వెళ్తూ ఓవర్‌టేక్ చేశారు. దీంతో బస్సు డ్రైవర్ శివలింగం ఆ యువకులపై మండిపడ్డాడు. ఇందుకు కోపోద్రిక్తులైన ఆ యువకులు బస్సును వెంబడించి సి.క్యాంప్ వద్ద బస్సు డ్రైవర్‌పై రాళ్లతో దాడి చేశారు. గాయాలకు గురైన డ్రైవర్ మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి


సమస్యలపై చర్చిస్తున్న సీపీఎం నాయకులు

కల్లూరు: కల్లూరు అర్బన్ వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం వార్డులోని కార్యకర్తలు కృషి చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నగేష్ అన్నారు. మంగళవారం కల్లూరు అర్బన్ శరీన్‌నగర్ సీపీఎం కార్యకర్తలతో కల్లూరులోని సూర్యనారాయణ భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శరీన్‌నగర్‌లోని 29, 30, 31వ వార్డులోని సమస్యలపై చర్చించారు. సీపీఎం నాయకులు సుధాకరప్ప, ఏసు, గోకారి, గిడ్డయ్య, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, మౌలాలి, దేవదాసు, లక్ష్మిదేవి పాల్గొన్నారు.

గ్రామ సభల్లో సమస్యలకు పరిష్కారం

కల్లూరు: రైతులు రెవెన్యూ గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఆంజనేయులు అన్నారు. మంగళవారం బొల్లవరం గ్రామంలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. రైతుల నుంచి అర్జీలు తీసుకున్నారు. మొత్తం 70 మంది రైతుల నుంచి అర్జీలు వచ్చాయని, వాటిని పరిశీలించి సకాలంలో పరిష్కారిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాసులు, వీఆర్వో, రైతులు పాల్గొన్నారు.

ఎగిరిన మువ్వన్నెల జెండా


జాతీయ జెండాను ఆవిష్కరించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్

కర్నూలు (టౌన్) : వీనస్ కాలనీ పార్కులో ఎప్పుడు రెపరెపలాడే జాతీయ జెండా కనిపించకపోవడం, పార్కు నిర్వహణ అధ్వానంగా ఉండటంపై ఈనెల 21వ తేదీన సాక్షిలో ప్రచురితమైన కథనంపై మునిసిపల్ అధికారులు స్పందించారు. పార్కులో జాతీయ జెండాను ఆవిష్కరించడంతో పాటు పరిశుభ్రత పనులకు శ్రీకారం చుట్టారు.

ట్రాఫిక్ జాం


ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్స్

కర్నూలు (రూరల్) : మండల పరిధిలోని వెంకాయపల్లి ఆలయం వద్ద మంగళవారం ట్రాఫిక్ సమస్య తలెత్తింది. ఇక్కడ ట్రాఫిక్ సమస్య ఎన్నో ఏళ్ల నుంచి ఉంది. మంగళ, శుక్రవారాల్లో ఇది నిత్యకృత్యం. పెళ్లి ముహూర్తాలు ఉన్నందున అమ్మవారి దేవర చేసే వారి సంఖ్య పెరిగింది. మధ్యాహ్న సమయాల్లో దేవర కార్యక్రమానికి హాజరై ఇంటకి వెళ్లేవారు, దేవర కార్యక్రమంలో పాల్గొని భోం చేసుకుని తిరుగు ప్రయాణమయ్యేవారు, భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ట్రాఫిక్ స్తంభించిపోతోందని స్థానికులు చెబుతున్నారు. గతంలో తాలూకా స్టేషన్ సీఐ ఇక్కడ ట్రాఫిక్ సమస్యను పరిష్కారం చేసేందుకు కర్నూలు-గుంటూరు రహదారిపై టెంకాయలు అమ్మే వ్యాపారస్తులు కేవలం ఫుట్‌పాత్ మీదే వ్యాపారం చేసేలా చర్యలు తీసుకున్నారు. ప్రధాన రహదారుల వెంబడి వాహనాల పార్కింగ్‌ను నిషేధించారు. అమ్మవారి దర్శనానికి వెళ్లే ప్రధాన దారిలో గాజులు, దేవుని పూజ సామగ్రి అమ్మే వ్యాపారస్తులకు స్టాల్స్‌ను కేటాయించే విధంగా చర్యలు తీసుకున్నారు. ఆ అధికారి బదిలీ అవ్వగానే ట్రాఫిక్ సమస్య మొదటికొచ్చింది. ప్రత్యేక వారాల్లో దేవాదాయ శాఖ వారు, తాలూకా పోలీసులు సమన్వయంతో ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రౌడీయిజం చేస్తే కఠిన చర్యలు

- కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్ హెచ్చరిక
- శరీన్‌నగర్‌లో పోలీసుల నాకాబందీ


శరీన్ నగర్‌లో రౌడీషీటర్లకు హెచ్చరికలు చేస్తున్న డీఎస్పీ బాబుప్రసాద్

కర్నూలు (టౌన్): ఎవరైనా రౌడీయిజం, గూండాయిజం చేస్తే కఠిన చర్యలు తప్పవని కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం తెల్లవారుజామున డీఎస్పీతో పాటు సీఐలు మధుసూదన్‌గౌడ్, పవన్ కుమార్, ప్రవీణ్ కుమార్, పార్థసారథిరెడ్డి, లక్ష్మయ్యలతో కలసి శరీన్‌నగర్‌లో నాకాబందీ నిర్వహించారు. ఇందులో ఆరుగురు సీఐలు, ఆరుగురు ఎస్ఐలు, 60 మంది పోలీసులు పాల్గొన్నారు. రౌడీషీటర్లు, అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లలో దాడులు చేశారు. ఏడుగురు రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అలాగే శరీన్ నగర్‌లో ఎలాంటి ధ్రువపత్రాలు లేని 15 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ ఇక కర్నూలు పట్టణంలో రాత్రి, పగలు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఎక్కడైనా, ఎవరైనా దౌర్జన్యాలకు పాల్పడితే వదిలిపెట్టమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు సమీర్ బాషా, చంద్రశేఖర్‌రెడ్డి, మోహన్‌కిషోర్ రెడ్డి, గోపీనాథ్, చంద్రశేఖర్‌రెడ్డి, మన్మథ విజయ్, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అయోడిన్ లోపంతో గర్భస్రావం

కర్నూలు(హాస్పిటల్): అయోడిన్ లోపంతో గర్భస్రావమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని డెమో శ్రీనివాసులు చెప్పారు. మంగళవారం స్థానిక వడ్డేగేరిలోని యూపీహెచ్‌సీ పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల నివారణ వారోత్సవాలు నిర్వహించారు. డెమో శ్రీనివాసులు మాట్లాడుతూ అయోడిన్ లోపం వల్ల గర్భస్రావంతో పాటు మృతశిశువు జననం, తక్కువ బరువుతో శిశువులు జన్మించడం, మరుగుజ్జుతనం, గొంతువాపు, చదువులో వెనుకబాటుతనం మొదలైన ఆరోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. మనుషుల శారీరక పెరుగుదలకు, అభివృద్ధికి, మానసిక వృద్ధికి, గర్భస్థ పిండం, చిన్నపిల్లల్లో మెదడు ఎదుగుదలకు, పిల్లల్లో తెలివితేటలకు అయోడిన్ ఎంతో ముఖ్యమని చెప్పారు. ముఖ్యంగా గర్భవతులు, చిన్నపిల్లలు తప్పకుండా అయోడిన్ ఉన్న ఉప్పునే వాడాలన్నారు. ప్రతి ఒక్కరూ నవ్వుతున్న సూర్యుడు గుర్తు ఉన్న ఉప్పు ప్యాకెట్‌ను మాత్రమే కొనాలని, అంతేగాక ఉప్పు నుంచి అయోడిన్ త్వరగా ఆవిరి అయ్యే లక్షణం ఉంటుంది కాబట్టి ఎండవేడిమి లేదా గాలి తగలకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. దానిని గాలి చొరబడని మూత ఉన్న డబ్బాల్లో నిల్వ చేయాలని తెలిపారు. వంట వండిన తర్వాత చివరలో మాత్రమే తగినంత అయోడిన్ ఉప్పును వేసి ఆవిరి పోకుండా పాత్రపై మూత పెట్టాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, సచివాల ఆరోగ్య కార్యకర్త సురేఖ, ఆశా కార్యకర్తలు రుబీన, మాణిక్యమ్మ పాల్గొన్నారు.

నేటి నుంచి ఆర్‌యూ బీఈడీ సెమిస్టర్ పరీక్షలు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో బుధవారం నుంచి ఈనెల 29వ తేదీ వరకు బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా 17 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రెగ్యులర్ 3,688 మంది, సప్లిమెంటరీ 1,513 మంది ఛాత్రోపాధ్యాయులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

ఘనంగా స్వాతంత్ర సమరయోధుడు జయంతి

కర్నూలు(సెంట్రల్): అవాజ్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్వాతంత్ర సమరయోధుడు షహీద్ అష్ఫాఖుల్లాఖాన్ 124వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కమిటీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి ఎస్ఏ సుభాన్, నగర అధ్యక్ష, కార్యదర్శులు పి.ఇక్బాల్‌హుస్సేన్, ఎస్ఎండీ షరీఫ్‌లు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశం కోసం షహీద్ అష్ఫాఖుల్లాఖాన్ 27 ఏళ్లకే ఉరి కంబం ఎక్కాడన్నారు.

విద్యుత్ అధికారులపై దాడి

కర్నూలు (న్యూసిటీ):నగరంలో విద్యుత్ అధికారులపై దాడి జరిగింది. పెండింగ్ విద్యుత్ బిల్లుల వసూళ్ల కోసం వెళ్లిన అధికారులపై అబ్దుల్ అనే వ్యక్తి మరో ఇద్దరితో కలిసి దాడి చేశారు. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.